క్లుప్తంగా

ఎంపీ మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా వస్తారు



ఎం.ప్రదీప్ కుమార్, మాజీ జెడ్పీటీసీ

వీరవాసరం: వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ మానకొండ ప్రదీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ కేసులతో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారని, ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు.

వెండి మకర పీఠానికి 93 గ్రాముల వెండి విరాళం



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి ఆదివారం దాతలు 93 గ్రాముల వెండి విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన సింహాద్రి పెద్దిరాజు, రమ్యశ్రీ దంపతులు 50 గ్రాములు, తోట రామమూర్తి, వెంకట పద్మావతి దంపతులు 43 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాంబర్లిన్‌కు సత్కారం



సాంబర్లిన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక సీఎస్ఐ చర్చి కౌన్సిల్ సభ్యులుగా మూడోసారి ఎన్నికైన ఎరిచర్ల సాంబర్లిన్‌ను ఆదివారం చర్చి ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణానికి సాంబర్లిన్ విశేష సేవలందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి ప్రకాశం, సిద్ధాపురం గ్రామ సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలంలోని వేండ్ర గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించినట్లు భీమవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓ.బలరామరాజు తెలిపారు. ఈ దాడుల్లో గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న సీహెచ్ వరదానంను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలి

పెనుమంట్ర: మాజీ మంత్రి, నగరి మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు ఆర్కే రోజాను దుర్భాషలాడిన నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించడం, చులకన భావంతో మాట్లాడడం టీడీపీ నాయకులకు ఆనవాయితీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేకపోవడంతో టీడీపీకి ప్రజల్లో ఆదరణ తగ్గుతుందని, దీంతో ప్రజలకు అండగా నిలబడే వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

జూదరుల అరెస్ట్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఇండస్ట్రీయల్ ఏరియాలో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని మంది అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు తెలిపారు. నిందితుల నుంచి రూ 1.43 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పంట కాలువల్లోకి ఆక్వా వ్యర్థాలు

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- మరిన్ని అక్రమ చెరువులకు అనుమతులు
- తాగునీటి కలుషితంపై ప్రజల ఆందోళన
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం



మహదేవపట్నంలో ఆక్వా వ్యర్థాలను కాలువలోకి తోడేస్తున్న దృశ్యం



ఉండి పంటకాలువ శివారులో తోడేస్తున్న ఆక్వా వ్యర్థాలు

ఉండి: పంట కాలువల్లోకి ఆక్వా వ్యర్థాలు విచ్చలవిడిగా వదిలేయడంతో ఎక్కడికక్కడ తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార గణం చొద్యం చూస్తోంది. అంతేకాకుండా మరిన్ని అక్రమ చెరువులకు అనుమతులు ఇచ్చి ప్రోత్సహించి ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. ఆక్వా చెరువులకు అనుమతులు ఇవ్వాలంటే ఎన్ని నిబంధనలు ఉన్నా ముఖ్యంగా అవుట్‌లెట్, ఇన్‌లెట్‌లు అనేవి తప్పనిసరి. అయితే అధికారులు వారి కార్యాలయాలకే పరిమితమై కాసులకు కక్కుర్తిపడి విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చేయడంతో ఆక్వాసాగు అనంతరం రైతులు వ్యర్థాలను డ్రెయిన్లలో వదిలే అవకాశం(అవుట్‌టెల్‌లు) లేకపోవడంతో నేరుగా పంట కాలువల్లోకే వదిలేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీరు దారుణమైన కాలుష్యంతో నిండిపోయింది. దీనివల్ల ఈ మధ్యకాలంలో కేన్సర్ వ్యాధిగ్రస్తులు విపరీతంగా పెరిగిపోతున్నారు. అంతే కాకుండా మరిన్ని రోగాల బారిన పడుతున్నారు. గత కొద్దిరోజులుగా నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆక్వా వ్యర్థాలను పంట కాలువల్లోకి వదలకూడదని ప్రచారం చేస్తున్నా ఆక్వా రైతులు మాత్రం పట్టించుకోవడం లేదు.

మరోసారి అక్రమ అనుమతులకు తెరలేపారు

ఇప్పటికే తాగునీటి కాలుష్యం దారుణంగా ఉన్నా దానిని పట్టించుకోకుండా అధికారులు మరోసారి అక్రమ అనుమతులకు తెరతీశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అడిగినా, అడగకపోయినా అధికారులు ప్రేరేపణతో ఆక్వాజోన్‌లోకి వరి పొలాలను చేర్చే కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించారు. దాని కోసం పెద్దగా ఎవ్వరికీ తెలియనీయకుండా గ్రామసభలు ఏర్పాటు చేసి ఎవరైతే రైతులు ఆసక్తిగా ఉన్నారో వారిని మాత్రం పిలిచి తూతూమంత్రంగా ముగించేశారు. ఎవరైనా ఏదైనా అడిగితే పంచాయతీల వద్ద నోటీసుబోర్డులో పెట్టాము చూసుకోండి అంటూ ఆక్వా అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలిస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీటికి కటకట

ఇప్పటికే నియోజకవర్గంలో స్వచ్ఛమైన తాగునీటికి ప్రజలు కటకటలాడిపోతుంటే మరిన్ని ఆక్వాచెరువులకు అక్రమ అనుమతులు ఇవ్వడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోకి విడిచి పెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవడంతోపాటుగా కొత్త చెరువులకు అనుమతులు ఇవ్వకుండా ప్రజాప్రతినిధులు అడ్డుకుని తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా తాగునీటి కాలుష్యాన్ని నివారించే చర్యలు అధికారులు కఠినంగా చేపట్టకపోతే సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసేందుకు ప్రజలు సిద్ధపడుతున్నారు.

అల్లూరి మెమోరియల్ హాల్ పునర్నిర్మించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునరిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునర్నిర్మాణ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం చెరుకువాడ రంగసాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పులకండం కోటేశ్వరరావు, సాధన కమిటీ నాయకులు కనుమూరి సత్యనారాయణ రాజు, కంతేటి వెంకటరాజు, జేఎస్వీ గోపాలన్, ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడారు. ఈ మెమోరియల్ హాల్ వేలాదిమంది వేద మధ్య తరగతి ప్రజలకు తక్కువ రుసుముతో వివాహ శుభకార్యాలకు ఉపయోగపడుతుందన్నారు. నిధుల మంజూరు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను కలిశామని, ఈ మెమోరియల్ హాల్ నిర్మాణానికి సహకరించకుంటే ఆగస్టు 15వ తేదీన నిరవధిక దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు.

కరాటేలో అవార్డు

ఆకివీడు: అజ్జమూరు గ్రామానికి చెందిన గంటా షైనీకి నేషనల్ మల్టీస్టార్ అవార్డు లభించింది. ఆదివారం విజయవాడలోని గజ్జల సరళాదేవి హాల్‌లో జరిగిన కరాటే పోటీల్లో షైనీకి ఈ అవార్డును సినీనటుడు భానుచందర్ చేతుల మీదుగా అందజేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

భీమవరం (ప్రకాశం చౌక్): వైన్ షాప్ వద్ద జరిగిన దాడి ఘటనకు సంబంధించి ముగ్గురిపై పోలీస్ కేసు నమోదైంది. భీమవరం టూటౌన్ ఎస్సై పి.రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 19వ తేదీన రాత్రి స్థానిక పద్మాలయ సెంటర్ సమీపంలోని సుచిత్ర వైన్స్ మార్ట్ మూసి వేస్తుండగా రావూరి రాజేష్, వెలివేల శ్రీహర్ష, వలవల యేసు వచ్చి మద్యం విక్రయించలేదని తనపై దాడి చేసి గాయపర్చినట్లు సేల్స్‌మెన్ ఉదయ్‌కుమార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ దాడిలోనే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి తనను కొట్టారని, తన జేబులోని రూ.10 వేలు పట్టుకుపోయారని, మద్యం సీసాలు ధ్వంసం చేశారని ఉదయ్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

ఏఐసీఎఫ్ ఇన్‌చార్జికి సత్కారం

ఉండి: ఆల్‌ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) రాష్ట్ర కోఆర్డినేటర్ మత్తి రాజ్‌కుమార్‌ను జిల్లా శాఖ ఆధ్వర్యంలో చెరుకువాడలో ఆదివారం సత్కరించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడుగా నియమితుడైన సందర్భంగా జిల్లా మాజీ అధ్యక్షుడు బందెల జార్జ్, జిల్లా కార్యదర్శి కోపనాతి పార్థసారథి, మండలాధ్యక్షుడు గొల్ల దానియేలు, మత్తి అశోక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాజ్‌కుమార్‌ను అభినందించారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



పాలకోడేరు: అమ్మవార్లకు ఆషాఢ సారె తీసుకువెళ్తున్న గ్రామస్తులు



ఆకివీడు: గంగానమ్మకోడు ప్రాంతంలోని మారెమ్మ తల్లికి బోనాల సారె

కోరుకొల్లులో ఆషాఢ సారె

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు గ్రామ దేవతలైన పోలేరమ్మ, పార్వతి అమ్మవార్లకు ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామస్తులు మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, రవికె, గాజులు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. గ్రామ దేవతలకు చలివిడి, పానకాలతో పూజలు చేశారు.

కోలనపల్లిలో ముత్యాలమ్మకు సారె సమర్పణ

కాళ్ల: మండలంలోని కోలనపల్లి గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీముత్యాలమ్మకు ఆదివారం గ్రామస్తులు ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవారికి సుమారు 500 కేజీలతో తయారు చేయించిన పలు రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులను మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మారెమ్మకు సారె

ఆకివీడు: ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం స్థానిక గంగానమ్మకోడు ప్రాంతంలో వేంచేసియున్న మారెమ్మ తల్లికి భక్తులు బోనాల సారెను సమర్పించారు. మహిళలు పసుపు నీళ్లతో నిండిన బిందెలపై దీపం వెలిగించి ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



కోలనపల్లిలో ముత్యాలమ్మకి సమర్పించిన ఆషాఢ సారె

ప్రత్యేక పూజలు



రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ మావుళ్ళమ్మవారు

వీరవాసరం: ఆషాడ మాస జాతర మహోత్సవానికి పురస్కరించుకుని ఆదివారం రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ మావుళ్ళమ్మ, మహాలక్ష్మమ్మ ,శ్రీ పోతురాజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు చేపట్టారు. చలిమిడి, వడపప్పు, పానకాలతో నైవేద్యాలు సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ క్యూలైన్‌లలో భక్తులు నిలబడి అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఈవో రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాత్వికాహారంతోనే ఆరోగ్యం

పాలకోడేరు: స్థానిక గోస్తని నది తీరం తీర్థ ప్రదేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పాలకోడేరు వాకర్స్ అసోసియేషన్, ఉషోదయ మహిళా వాకర్స్ అసోసియేషన్, అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ మోగల్లు వారి సంయుక్త సౌజన్యంతో ఆదివారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దంతులూరి వెంకటేశ్వరరాజు (గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ సిరిపురపు యుధిష్టర్ (కార్డియాలజిస్ట్), డాక్టర్ జె.శివకుమార్ (న్యూరాలజిస్ట్) డాక్టర్ యు.నాగరాజు (జనరల్ మెడిసిన్) పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. సాత్వికాహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం చేయడం, ప్రతి రోజు నడవడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశానికి వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ వాకర్ గుంటూరి రామరాజు అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ జేఎస్ కుమార్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

భీమవరం (ప్రకాశంచౌక్): నేర ప్రవృత్తికి స్వస్తి చెప్పి, సత్ప్రవర్తనతో జీవించాలని, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నేడు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులను, రౌడీ షీటర్లను సంబంధిత పోలీసు అధికారులు స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంచడం జరుగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు నమోదు చేసి జైలుకు పంపిస్తామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కాళీచరణ్

యోగాతో మానసిక ప్రశాంతత

భీమవరం(ప్రకాశంచౌక్): యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచించారు. భీమవరం బైపాస్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ జిల్లాస్థాయి యోగాసన పోటీలను ఆదివారం నిర్వహించారు. 10 కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కె.వెంకటరాజు, వి.శ్రీవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోర్ట్రైట్ డెమో - కళా ప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకునేలా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. తొలుత ఈ ప్రదర్శనను కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన చిత్రాలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొంది, రెండు గిన్నిస్ రికార్డులను సాధించిన కేరళకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు ఎ.పద్మరాజు, సెక్రటరీ పీవీ రామరాజు, ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను అందించాలని కోరారు.

ప్రభుత్వ యంత్రాంగం.. డిప్యుటేషన్లే అధికం



తలుపులు వేసి ఉన్న వార్డు సచివాలయం-5 భవనం



ఆకివీడు మండల పరిషత్ భవనం

- డిప్యుటేషన్లపై వచ్చిన వారే మండల స్థాయి అధికారులు
- వార్డు సచివాలయాల్లోనూ సిబ్బంది కొరతే
- ఆయా శాఖలో పరిధిలో స్తంభించిన పాలన

ఆకివీడు: మండలంలోని ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేసే మండల అధికారులు అధిక సంఖ్యలో డిప్యుటేషన్లపై రావడంతో పనులు ముందుకు సాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిధిలో పని చేసే పలువురు మండల స్థాయి అధికారులు బదిలీ కావడం, పదవీ విరమణ చేయడంతో వారి పోస్టుల్లో కొత్తవారిని భర్తీ చేయకపోవడంతో డిప్యుటేషన్లపైనే ఆయా శాఖలు పనిచేస్తున్నాయి. దూర ప్రాంతాలకు బదిలీ అయిన వారిని కూడా ఇక్కడకు డిప్యుటేషన్ వేయడంతో ఎక్కడ పనిచేయాలో తెలియక వారు సతమతమవుతున్నారు. దీంతో వారు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలో ప్రధాన పోస్టు అయిన మండల పరిషత్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల బదిలీపై వచ్చిన ఎంపీడీఓ మళ్లీ బదిలీల్లో వారి సొంత జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో ఈఓపీఆర్‌డీ డిప్యుటేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్ ఏఈ, ఎంఈఓ, హౌసింగ్ ఏఈ, మండల వ్యవసాయాధికారి, ఇరిగేషన్ ఏఈ, మత్స్యశాఖ మండల అధికారి పోస్టులు డిప్యుటేషన్‌పై నడుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా మండలంలోని ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టు కూడా డిప్యుటేషన్‌పైనే ఉంది. ముఖ్య శాఖల అధికారులు లేకపోవడంతో మండలంలో పరిపాలన స్తంభించిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

వార్డు సచివాలయాల్లోనూ అదే పరిస్థితి

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ ఉన్న సిబ్బంది వేరే ప్రాంతాలకు వెళ్లగా ఇక్కడకు రావాల్సిన వారు నేటికీ రాలేదు. దీంతో ఐదు సచివాలయాల్లో 25 మంది సిబ్బందికి 20 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పనులు పూర్తిగా స్తంభించిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏఎన్ఎం, మహిళా పోలీస్ అక్కడక్కడా ఉన్నారు. కొత్తగా విధుల్లోకి చేరాల్సిన వారు చేరకపోవడంతో ఆయా సీట్లు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పలు సచివాలయాల్లో సిబ్బంది కొరతతో డిప్యుటేషన్లపైనే ఆయా సిబ్బంది పనిచేశారు. వారు కూడా బదిలీ కావడంతో ప్రస్తుతం ఎవరూ లేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరతతో పనులు సక్రమంగా జరగక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డిప్యుటేషన్ల విధానాన్ని రద్దు చేసి, ఆయా స్థానాల్లో అధికారుల్ని, సిబ్బందిని నియమించి, మండల అభివృద్ధికి ఉన్నతాధికారులు సహకరించాలని పలువురు కోరుతున్నారు.

నరసాపురంలో డ్రెయిన్లు అధ్వానం

- వర్షాలతో పొంగి పొర్లుతున్న ఛైనం
- పట్టించుకోని పాలకులు

నరసాపురం: ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా కూడా నరసాపురం పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ నానాటికీ క్షీణిస్తోంది. పట్టణంలో ఏ డ్రెయిన్‌ను చూసినా దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు భారీ ప్రాజెక్ట్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినా కూడా ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ ఊసే లేకుండా పోయింది. దీంతో కొంత కాలంగా కొత్తగా డ్రెయిన్లను నిర్మించకపోవడం, కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో డ్రెయిన్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి.

అన్ని డ్రెయిన్లు అంతే

ప్రస్తుతం పట్టణంలో చాలా ప్రాంతాల్లో డ్రెయిన్ల ఇబ్బందులున్నాయి. పట్టణంలో బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీలున్నాయి. వార్డులోని పలు వీధుల్లో ఉన్న ఉప డ్రెయిన్లన్నీ ఈ ప్రధాన డ్రెయినేజీల్లో కలుస్తాయి. ప్రధాన డ్రెయిన్లన్నీ గోదావరిలో ఐదు చోట్ల కలుస్తాయి. మురుగు గోదావరిలో కలిసే చోట ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లు కూడా సరిగ్గా లేవు. గోదావరిలో మురుగు కలిసే చోట అవుట్‌లెట్‌లు సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉంటుంది. ఇక డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలు వర్షం నీరు పారక నీటమునుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వర్షపునీరు సవ్యంగా పారేటట్లు డ్రెయినేజీలను ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 21, 22,23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్ పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్లను వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది.



పట్టణంలోని బస్టాండ్ పక్కన ప్రధాన ప్రాంతంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

స్పెషల్ ప్రాజెక్ట్ ఊసేది?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నరసాపురం మున్సిపాలిటీలో రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థికశాఖ అనుమతులతో పనులు మొదలు పెట్టడానికి మొదటి విడతగా రూ 50 కోట్లు మంజూరు కూడా చేసింది. ప్రాజెక్టులో భాగంగా ముందుగా 1 నుంచి 9 వార్డుల్లో పనులు మొదటు పెట్టడానికి టెండర్లు కూడా పిలిచారు. తరువాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. ఈ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ అంశంపై నోరుమెదిపిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి పట్టణంలో డ్రెయిన్ల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.